క్లుప్తంగా

నేడు ఎస్ఎన్‌పాడులో మంత్రి పరిచయ కార్యక్రమం

చీమకుర్తి: సంతనూతలపాడులో సోమవారం సాయంత్రం 3 గంటలకు స్థానిక నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త మంత్రి మేరుగు నాగార్జున పరిచయ కార్యక్రమం ఉంటుందని ఆ పార్టీ మండల కన్వీనర్ దుంపా చెంచిరెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీపీ, జెడ్పీటీసీతో పాటు మండలంలోని అందరు సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొనాల్సిందిగా చెంచిరెడ్డి విజ్ఞప్తి చేశారు.

పీఎఫ్ నంబర్ కేటాయించాలి

ఒంగోలు: ప్రభుత్వంలో విలీనమైన ఎయిడెడ్ ఉపాధ్యాయులకు జెడ్పీ సీఈఓ ప్రావిడెంట్ ఫండ్ నెంబర్ కేటాయించాలని ఏపీ టీచర్స్ గిల్డ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కోడూరి వెంకట్రావు, సీహెచ్ ప్రభాకరరెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. జీఓ నంబర్ 50 ప్రకారం ఆస్తులతో సహా కేవలం ఉపాధ్యాయులను మాత్రమే ప్రభుత్వ పాఠశాలలకు కౌన్సెలింగ్ ద్వారా జిల్లా పరిషత్, మండల పరిషత్ , మున్సిపల్ పాఠశాలల్లో 215 మంది చేరారన్నారు. జిల్లా విద్యాశాఖ అధికారి సంబంధిత ప్రొసీడింగ్స్ ఉత్తర్వులు జారీ చేసినా ఉపాధ్యాయుల వద్ద నుంచి జెడ్పీ కార్యాలయ సిబ్బంది దరఖాస్తు స్వీకరణకు జాప్యం చేస్తున్నారన్నారు. కనుక జెడ్పీ సీఈఓ స్పందించి పీఎఫ్ అకౌంట్ ఓపెన్ చేసేందుకు చర్యలు చేపట్టాలని కోరారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

లింగసముద్రం: అక్రమంగా ఇసుక తరలిస్తున్న ఇసుక ట్రాక్టర్‌ను పట్టుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించినట్లు ఎస్‌హెచ్‌ఓ ఎ.మల్లికార్జున తెలిపారు. మండలంలోని అన్నెబోయినపల్లె వద్ద ఉన్న మన్నేరు వాగు నుంచి ఆదివారం తెల్లవారుజామున ఇసుకను తరలిస్తున్నట్లు సమాచారం తెలియడంతో సిబ్బందితో వెళ్లి ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించి డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్‌హెచ్‌ఓ పేర్కొన్నారు.

ప్రతిభను వెలికితీయడానికే పోటీలు

వేటపాలెం: విద్యార్థుల్లో ప్రతిభను వెలికితీయడానికే ప్రతిభా పోటీలు ఉపయోగపడతాయని బండ్ల బాపయ్య హిందూ కాలేజీ సెక్రటరీ లేళ్ల కృష్ణమూర్తి పేర్కొన్నారు. స్థానిక బండ్ల బాపయ్య హిందూ జూనియర్ కళాశాల్లో బాపయ్య ఎడ్యుకేషన్ స్కాలర్‌షిప్ ప్రతిభా పోటీలు ఆదివారం నిర్వహించారు. ఈ పోటీలకు వివిధ ప్రాంతాల్లో పదో రగతి చదువుతున్న 255 మంది విద్యార్థులు పోటీల్లో పాల్గొన్నారు. ప్రతిభా పోటీల్లో పాల్గొని ప్రథమ స్థానంలో నిలిచిన విద్యార్థికి రూ. 5,116, రెండో స్థానంలో నిలిచిన విద్యార్థికి రూ. 3,116, త్రీతీయ స్థానంలో నిలిచిన విద్యార్థికి రూ. 2,116, మరో ఏడుగురు విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతి ఒక్కొక్కరికి రూ. 1000గా అందించనున్నట్లు తెలిపారు.

జగనన్న మళ్లీ సీఎం కావాలని ప్రార్థనలు

మార్టూరు: ముస్లింల సంక్షేమం కోసం అనేక పథకాలు ప్రవేశ పెట్టిన సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి తిరిగి ముఖ్యమంత్రి కావాలని ఆదివారం మండలంలోని మార్టూరు గ్రామంలో ముస్లింలు ప్రార్థనలు నిర్వహించారు. బాపట్ల జిల్లా వక్ఫ్ బోర్డు కార్యదర్శి గడ్డం మస్తాన్‌వలి ఆధ్వర్యంలో మార్టూరు గ్రామంలో జగనన్న ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా వచ్చిన తరువాత ముస్లింలకు చేసిన సంక్షేమ పథకాలు గురించి మసీదుల వద్ద మౌజన్‌లకు, మత పెద్దలకు వివరించారు. మసీదుల ముత్తవల్లిలు మీరావలి, ఎంపీటీసీ కరిముల్లా, ఇమామ్ హుస్సేన్, అల్తాఫ్ హుస్సేన్,సీఎం ముఖ్యమంత్రి కావాలని మసీదులో ప్రార్థనలు నిర్వహించిన వారిలో ఉన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు క్రీడాకారుల ఎంపిక

వేటపాలెం: ఉమ్మడి ప్రకాశం 50వ జిల్లా మాస్టర్ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్ 2023–24 పోటీల్లో వేటపాలేనికి చెందిన మాజీ ఎంపీటీసీ గాత్రం ఉమామహేశ్వరరావు ప్రతిభ కనబరిచి విజేతగా నిలిచారు. ఆదివారం ఒంగోలులో లార్డ్ బ్యాడ్మింటన్ అకాడమీ జిల్లా స్థాయి బ్యాడ్మింటన్ పోటీలు నిర్వహించారు. పోటీల్లో విజేతగా నిలిచిన ఉమామహేశ్వరరావు 40 ఏళ్ల విభాగంలో ఫిబ్రవరి 17, 18 తేదీల్లో రాజమండ్రిలో జరగబోవు సీనియర్ బ్యాడ్మింటన్ పోటీలకు ఎంపికయ్యారు. వీరితో 50 ఏళ్ల విభాగంలో హరిపురుషోత్తం, రహీం ఎంపికయ్యారు. వీరిని వేటపాలెం అసోసియేషన్ క్రీడాకారులు అభినందించారు.

శింగరకొండ దర్శిని


ప్రసన్నాంజనేయ స్వామి మూలవిరాట్టు

అద్దంకి: శోభకృతు నామ సంవత్సరం, ఉత్తరాయనం, పుష్య మాసం, పుబ్బ నక్షత్రం, చవితి తిథి సందర్భంగా సోమవారం ప్రత్యేక పూజలు చేస్తారని దేవస్థాన ఏసీ సుభద్ర ఆదివారం తెలిపారు. ఉదయం బిందె తీర్థం. మధ్యాహ్నం 1.00 గంట నుంచి 1.30 గంట వరకు పంచ హారతుల పూజ నిర్వహిస్తారు. రాత్రి 7 గంటల నుంచి 7.45 గంటల వరకు జరిగే ప్రదోషకాలార్చన అనంతరం ఆలయం మూసివేస్తారు.

మహిళా సాధికారతపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి


జ్యూట్ బ్యాగుల తయారీ యూనిట్‌ను పరిశీలిస్తున్న బాలినేని శ్రీనివాసరెడ్డి

ఒంగోలు: మహిళా సాధికారతకు ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని, మహిళలు సద్వినియోగం చేసుకోవాలని స్థానిక ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి అన్నారు. ఆదివారం స్థానిక డ్వాక్రా బజార్‌లో నూతనంగా మెప్మా ఆధ్వర్యంలో పట్టణ ప్రగతి యూనిట్‌లో భాగంగా రత్నం జ్యూట్ బ్యాగ్ తయారీ పరిశ్రమను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన యూనిట్‌లోని మెషీన్లను, మెప్మా రాష్ట్ర కార్యాలయం నుంచి వచ్చిన ఫర్నిచర్‌ను పరిశీలించారు. మెప్మా పీడీ రవికుమార్ మాట్లాడుతూ పరిశ్రమకు అవసరమైన రా మెటీరియల్‌తో సహా రాష్ట్ర కార్యాలయం నుంచి మంజూరైందని, జిల్లాలో మొత్తం నాలుగు పట్టణాల్లో ఒక్కో యూనిట్ చొప్పున మంజూరైందన్నారు. గిద్దలూరు, చీమకుర్తి, కనిగిరి, ఒంగోలులో మంజూరయ్యాయని వివరించారు. ఈ సందర్భంగా బాలినేని మాట్లాడుతూ మహిళలు ఆర్థికంగా బలపడితే ఆ కుటుంబం బాగుంటుందని, తద్వారా సమాజం వేగవంతంగా అభివృద్ధి చెందుతుందన్నారు. పర్యావరణ హితంగా ఉండే జ్యూట్ బ్యాగులను ప్రజలు కూడా వినియోగిస్తూ పర్యావరణాన్ని కాపాడేందుకు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ప్లాస్టిక్ రహిత సమాజం వైపు సాగుతూనే మహిళా సాధికారతకు కూడా ప్రభుత్వం పెద్ద పీట వేయడం గర్వకారణం అని నగర మేయర్ గంగాడ సుజాత పేర్కొన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ వేమూరి సూర్యనారాయణ, ఆర్య వైశ్య కార్పొరేషన్ డైరెక్టర్ కుప్పం ప్రసాద్, కార్పొరేటర్లు, వైఎస్సార్‌సీపీ నాయకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

యెకోహోమా షోరూంను ప్రారంభించిన బాలినేని

ఒంగోలు: స్థానిక సుజాతనగర్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన యెకోహోమా టైర్ల షోరూంను ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వినియోగదారుల మన్ననలను చూరగొంటూ మంచి సంస్థగా గుర్తింపు పొందాలని ఆకాంక్షిస్తున్నట్లు పేర్కొన్నారు.బాలినేనిని షోరూం యజమాని నాగలక్ష్మి సత్కరించారు.

మంగమూరు రోడ్డు డివైడర్లకు శంకుస్థాపన


డివైడర్లకు శంకుస్థాన చేస్తున్న ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి, మేయర్ గంగాడ సుజాత

ఒంగోలు మెట్రో: స్థానిక మంగమూరు రోడ్డులో నూతనంగా నిర్మించనున్న డివైడర్లకు మాజీ మంత్రి, ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో పాల్గొన్న బాలినేని మాట్లాడుతూ ఒంగోలు నగరం అభివృద్ధిలో భాగంగా మంగమూరు రోడ్డు డివైడర్లకు రూ.25 లక్షలకు టెండర్లతో త్వరలో పనులు ప్రారంభిస్తామని తెలిపారు. కార్యక్రమంలో నగర మేయర్ గంగాడ సుజాత, 35వ డివిజన్ కార్పొరేటర్ గిరిజా శాండిల్య, నగర కమిషనర్ వెంకటేశ్వర్లు, 35వ డివిజన్ సచివాలయం సిబ్బంది, వలంటీర్లు, నగరపాలక సంస్థ సిబ్బంది పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ ప్రభంజనం సృష్టిస్తుంది


జీ.అరవింద

చీమకుర్తి: రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో రాష్ట్రంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభంజనం సృష్టిస్తుందని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర మహిళా విభాగం ప్రతినిధి జీ.అరవింద అన్నారు. ఆదివారం చీమకుర్తిలోని హరిహరక్షేత్రంను దర్శించుకున్న అనంతరం మీడియాతో మాట్లాడారు. సంతనూతపాడులో మంత్రి మేరుగు నాగార్జునను మంచి మెజారిటీతో గెలిపించాలని స్థానిక ఓటర్లకు విజ్ఞప్తి చేశారు.

అట్రాసిటీ కేసు నమోదు

చీమకుర్తి: భూవివాదంలో ఎం.బేబీకుమారి ఫిర్యాదు మేరకు మర్రిపూడి మండలం రామాయపాలేనికి చెందిన యరమోతు కోటేశ్వరరావు, రాజేశ్వరరావు, దుర్గా నందిని, రమణయ్యపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసినట్లు ఎస్సై జీ.రామిరెడ్డి తెలిపారు. బూదవాడ పంచాయతీ సర్వే నంబర్ 235లో బేబీకుమారికి చెందిన 1.02 ఎకరాల భూమిలో ఆక్రమణలకు పాల్పడినందుకు అట్రాసిటీ కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

వధూవరులకు ఆశీర్వాదం


వధూవరులతో ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి, శచీదేవి దంపతులు

కొత్తపట్నం: స్థానిక నల్లూరి గార్డెన్‌లో ఒంగోలు నగరం మాంటిస్సోరి స్కూల్ కరస్పాండెంట్, జిల్లా రెడ్‌క్రాస్ చైర్మన్ ప్రకాష్ నాయర్ కుమారుడు శబరినాథ్, కేరళ రాష్ట్రానికి చెందిన ఇషా వివాహ వేడుకల్లో ఆదివారం మాజీ మంత్రి, ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి, సతీమణి శచీదేవి దంపతులు పాల్గొని వధూవరులను ఆశీర్వదించారు. ఆయనతో పాటు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు జంకె వెంకటరెడ్డి, మాజీ మంత్రి శిద్దా రాఘవరావు, నెల్లూరు పట్టభద్రుల ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, మరి కొంత మంది ముఖ్య నాయకులు హాజరయ్యారు. వధూవరులను ఆశీర్వదించి వివాహ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా అగ్రికల్చర్ అడ్వైజరీ బోర్డు చైర్మన్ ఆళ్ల రవీంద్రరెడ్డి, మాజీ ఎంపీపీ వాయల మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

ఏడుకొండలును స్ఫూర్తిగా తీసుకోవాలి


సన్మానం అందుకుంటున్న ఏడుకొండలు

ఒంగోలు సెంట్రల్: ఎస్సై రాత పరీక్షల్లో విజయం సాధించిన నేలటూరి ఏడుకొండలు విద్యార్థులకు ఆదర్శమని ఒంగోలు ఒకటో పట్టణ సీఐ ఎం లక్ష్మణ్ అన్నారు. సంతపేటలోని ఎస్సీ బాలికల వసతి గృహంలో ఆదివారం వలేటివారిపాలెం మండలం పోలినేనిపాలెం గ్రామానికి చెందిన నేలటూరి ఏడుకొండలకు సన్మాన కార్యక్రమం నిర్వహించారు. సీఐ లక్ష్మణ్ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. విద్యార్థిగా ఉన్న సమయంలో తగిన కృషి చేస్తే ఉన్నత శిఖరాలు చేరుకుంటారని ఏడుకొండల చేసిన కృషిని ఆదర్శంగా తీసుకోవాలని కోరారు. జై భీం వాయిస్ అధ్యక్షుడు కంకణాల ఆంజనేయులు, జైభీం పీపుల్ జేఏసీ అధ్యక్షుడు అంబటి కొండలరావు, రామ్ రాయ్ అంబేడ్కర్ చారిటబుల్ ట్రస్టు చైర్మన్ బల్లికురవ వెంకట్, బాలికల సంక్షేమ గృహ అధికారి సరితా ఏడుకొండలకు శుభాకాంక్షలు తెలిపారు. ఏడుకొండలు తాను సాధించిన విజయానికి తోడ్పడిన వారికి కృతజ్ఞతలు తెలిపారు.

ఫోన్ పక్కన పడేసి పుస్తకాలు చదవండి


పిల్లలతో కథల చదివిస్తున్న ఉపాధ్యాయుడు జాలాది మోహన్

ఒంగోలు టౌన్: ఫోన్ పక్కన పడేసి పుస్తకాలు చదివితే మెదడు క్రియాశీలకంగా తయారవుతుందని, ఆలోచనా శక్తి పెరుగుతుందని బహుజన ఉపాధ్యాయ సంఘ నాయకుడు జాలాది మోహన్ అన్నారు. ఆదివారం జిల్లా గ్రంథాలయంలో చదవడం మాకిష్టం కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా చిన్నారులకు నీతి కథలను బోధించిన తరువాత వారితో కథలు, ఇంగ్లిష్ రెయిమ్స్ చెప్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ...పుస్తకాలు మెదడును చురుగ్గా ఉంచుతాయన్నారు. పుస్తకాల్లో ఉన్న విషయాలను ఆకళింపు చేసుకునేందుకు తలిదండ్రులు సహకరించాలని సూచించారు. ప్రతి రోజు తలిదండ్రులు పిల్లలతో కొద్ది సమయం గడపాలని, వారితో మనసువిప్పి మాట్లాడాలని చెప్పారు. తద్వారా పిల్లల్లో ఆత్మవిశ్వాసం పెరుగుతుందని, చదువులు, ఆటల్లో రాణిస్తారని చెప్పారు. పుస్తకాలను చదవడం వల్ల కొత్త కొత్త పదాలు, సరికొత్త అర్థాలు తెలుస్తాయన్నారు. దేశాలు, ప్రాంతాల మధ్య జరిగిన ఘర్షణలు, ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు అనేకం తెలుస్తాయన్నారు. పిల్లలు టైమ్ మేనేజ్‌మెంట్‌ను అలవాటు చేసుకోవడం ద్వారా క్రమశిక్షణ అలవడుతుందని ఉపగ్రంథపాలకురాలు బొమ్మల కోటేశ్వరి చెప్పారు. ప్రతి ఒక్కరూ గ్రంథాలయ సభ్యత్వం తీసుకోవాలని కోరారు. కె.సంపూర్ణమ్మ, ఎస్ అనిల్ కుమార్, స్టెల్లీ, పలువురు పాఠకులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో గోపూజ, మహానివేదన

సీఎస్‌పురం(పామూరు): మండలంలోని మిట్టపాలెం నారాయణస్వామి ఆలయంలో ఆదివారం గోపూజ, మహానివేదన అర్చకులు మహంకాళి ప్రసాద్‌శర్మ ఆధ్వర్యంలో వేదమంత్రాలతో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నారాయణస్వామి మూలవిగ్రహమూర్తికి పంచామృతాభిషేకం, విశిష్ట పూజలు చేశారు. గోవుకు శాస్త్రోక్తంగా గోపూజ నిర్వహించారు. అనంతరం భజంత్రీల మేళతాళాలనడుమ మహా నైవేద్యంతో ఆలయంచుట్టూ ప్రదక్షిణలు చేసి పొంగలిని స్వామికి నైవేద్యంగా సమర్పించారు. ఆలయ వ్యవస్థాపక చైర్మన్ కొమ్మినేని చిన్న ఆదినారాయణ, ఈఓ జి.రమణారెడ్డి, కొమ్మినేని వెంకట్రావు, ముడుమాల నారాయణరెడ్డి, మధుసూదన్, సుబ్బరాయుడు, నాగరాజు, భక్తులు, సిబ్బంది పాల్గొన్నారు.

చంద్రబాబు బృందం పేదలను రాబందుల్లా అణగతొక్కేస్తారు


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న కోటేశ్వరరావు

ఒంగోలు టౌన్: చంద్రబాబు, అతడి బృందం ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలను 50 సంవత్సరాలు వెనక్కి పోయేలా అణగతొక్కుతారని ఆంధ్రప్రదేశ్ కార్మిక శాఖ సంక్షేమ మండలి బోర్డు రాష్ట్ర సభ్యుడు పెద్దిపోగు కోటేశ్వరరావు విమర్శించారు. ఆదివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... త్వరలో జరగనున్న సాధారణ ఎన్నికల్లో మళ్లీ వైఎస్ జగన్ మోహన్ రెడ్డిని ముఖ్యమంత్రిగా గెలిపించుకోవాల్సిన అవసరం నిరుపేద ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ ప్రజల మీద ఉందని స్పష్టం చేశారు. లేకపోతే దుర్మార్గుడైన చంద్రబాబు నిరుపేదలను మరింత నిరుపేదలుగా మారుస్తారని చెప్పారు. వైఎస్ జగన్ మోహన్ రెడ్డి పాలనలో దేశంలో ఎక్కడా లేనివిధంగా సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారన్నారు. తిరిగి జగన్ మోహన్ రెడ్డిని గెలిపించుకోవాల్సిన అవసరం ఉందని నిరుపేదలు ఒక అవగాహనకు వచ్చారని చెప్పారు. త్వరలోనే ముఖ్యమంత్రిని కలిసి రాష్ట్రంలోని పరిస్థితిని వివరిస్తానన్నారు.

భైరవకోనలో ప్రముఖుల పూజలు


భైరవకోనలో పూజల్లో పాల్గొన్న ఆంధ్రకేసరి యూనివర్శిటీ వీసీ దంపతులు, ప్రముఖులు

సీఎస్‌పురం(పామూరు): ప్రముఖ పుణ్యక్షేత్రం, పర్యాటక కేంద్రం భైరవకోనను ఆంధ్రా యూనివర్శిటీ వైస్‌చాన్స్‌లర్ ఎం అంజిరెడ్డి దంపతులు, శ్రీహరికోట అసిస్టెంట్ సైంటిస్ట్ డీవీ రావు దంపతులు, పలువురు ప్రముఖులు ఆదివారం సందర్శించారు. ఈ సందర్భంగా త్రిముఖ దుర్గాదేవి, భైరవేశ్వరస్వామి, నగరేశ్వర ఆలయాలను సందర్శించి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ చైర్మన్ సిద్దు రమణారెడ్డి, ఈఓ నర్రా నారాయణరెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ముందుగా వారు జలపాతాన్ని సందర్శించారు. డీఈఈ పి.రాజన్న, మద్దుల శ్రీనివాసులు, ఎన్. వెంకటేష్, ఆర్.నాగరాజు, కార్యక్రమంలో అర్చకులు, ఆలయ కమిటీ పాల్గొన్నారు.

సాబ్జి పోరాటాలు స్ఫూర్తిదాయకం


సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

ఒంగోలు : పీడీఎఫ్ ఎమ్మెల్సీగా షేక్ సాబ్జి ప్రజా సమస్యల పరిష్కారం కోసం చేసిన పోరాటాలు ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిదాయకమని హెచ్‌ఎం అసోసియేషన్ అధ్యక్షుడు కాంతారావు అన్నారు. సమగ్రశిక్ష జిల్లా జేఏసీ సమావేశం నగరంలోని యూటీఎఫ్ కార్యాలయంలో ఆదివారం నిర్వహించారు. ఇటీవల రోడ్డు ప్రమాదంలో మరణించిన ఎమ్మెల్సీ షేక్ సాబ్జి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రజల పక్షాన గొంతు వినిపించడమే సాబ్జికి నిజమైన నివాళి అవుతుందన్నారు. ఐక్యతగా పోరాడినప్పుడే విజయం సాధ్యమవుతుందన్నారు. కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి వీరాంజనేయులు, సీఐటీయూ నాయకులు కొండారెడ్డి, మహేష్, శ్రీదేవి, వెంకాయమ్మ, బిన్నీ మాధవాచారి, సుధా, మనీషా, రవి, ఆనంద్, హనుమానాయక్, వెంకటేశ్వరరావు, సింగయ్య, మధు, వినయ్ కుమార్ పాల్గొన్నారు.

టీడీపీ నుంచి వైఎస్సార్ సీపీలో చేరిక


బాలినేని సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరిన టీడీపీ నాయకులు

ఒంగోలు: వైఎస్సార్ సీపీ ముస్లిం మైనార్టీ జిల్లా అధ్యక్షుడు సయ్యద్ జలీల్ నేతృత్వంలో బలరాం కాలనీకి చెందిన పలువురు టీడీపీ ముస్లిం నాయకులు ఆదివారం వైఎస్సార్ సీపీలో చేరారు. షేక్ మస్తానీ, వారి కుటుంబసభ్యులతో పాటు వారి అనుచరులకు బాలినేని స్వయంగా కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో డివిజన్ నాయకులు గందు మధు, షేక్ జాఫర్, హబీబ్, సుల్తాన్, అమర్, శ్రీనివాసరెడ్డి, రబ్బాని, నాయక్, కందుకూరు రఫీ, మైనార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎస్టీయూ నూతన కార్యవర్గం ఎన్నిక


ఎస్టీయూ నూతన కార్యవర్గం

చీమకుర్తి: ఎస్టీయూ ఉపాధ్యాయ సంఘం చీమకుర్తి మండల శాఖ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నట్లు ఆ శాఖ జిల్లా కౌన్సిలర్ డీ.నాగయ్య తెలిపారు. ఎస్టీయూ ఉపాధ్యాయ సంఘం టీచర్ల సమక్షంలో ఆదివారం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నట్లు చెప్పారు. అధ్యక్షునిగా కొమ్మాలపాటి శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శిగా షేక్ ఖాదర్‌బాషా, ఆర్థిక శాఖ కార్యదర్శిగా డీ.రమణయ్య, జిల్లా కౌన్సిలర్లుగా దేవరకొండ నాగయ్య, ఆర్.శ్రీధర్, పీ.మల్లేశ్వరి, జీసీహెచ్ యల్లయ్యలను ఎన్నుకున్నారు. ఎస్టీయూ రాష్ట్ర బాధ్యులుగా ఉన్న వెంగళరెడ్డి, రాష్ట్ర కౌన్సిలర్ చల్లా శ్రీనివాసరావు, జిల్లా ఆర్థిక కార్యదర్శి నరశింహారెడ్డి సమక్షంలో ఈ కార్యక్రమం జరిగింది. నూతనంగా ఎన్నికైన కమిటీకి సభ్యులు శుభాకాంక్షలు తెలిపారు.

చేతివృత్తులతో ఆర్థికాభివృద్ధి


కొత్తపట్నంలో కుట్టుమిషన్ శిక్షణా కేంద్రాన్ని ప్రారంభిస్తున్న వాయిల మోహన్‌రావు

కొత్తపట్నం: చేతివృత్తులతో మహిళలు ఆర్థికంగా ఎదుగుతారని మాజీ ఎంపీపీ వాయిల మోహన్ రావు అన్నారు. మాగుంట చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి సహకారంతో ఉచిత కుట్టుమిషన్ శిక్షణా కేంద్రాన్ని ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాగుంట వారి సహకారంతో ఇప్పటికే ఈతముక్కలలో గత ఏడాది కుట్టు మిషన్ శిక్షణ కేంద్రాన్ని ప్రారంభించామన్నారు. మహిళలు ఉత్సాహంగా శిక్షణలో పాల్గొనాలన్నారు. శిక్షణ అనంతరం ఉచితంగా కుట్టు మిషన్ పంపిణీ చేస్తామన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ మూగ వెంకటేశ్వర్లు, గౌరవరపు శివాజీ, మోటుపల్లి యానాది, నక్కన కోటయ్య, తంబి వెంకటేశ్వర్లు, మేడా శ్రీనివాసరావు, రామలింగం సుధాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఐక్యంగా పార్టీ గెలుపునకు కృషిచేద్దాం


కార్యకర్తల ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న నలమలపు కృష్ణారెడ్డి

నాగులుప్పలపాడు: రాబోవు ఎన్నికల్లో అన్ని గ్రామాల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జెండా ఎగురవేసి సంతనూతలపాడు నియోజకవర్గం నుంచి మేరుగు నాగార్జునను గెలిపించడంతో పాటు ముఖ్యమంత్రిగా జగన్‌మోహన్ రెడ్డిని మళ్లీ చూడాలంటే గ్రామాల్లో ప్రతి వైఎస్సార్ సీపీ కార్యకర్త, నాయకులు మరింత బలంగా పనిచేయాలని పార్టీ వాణిజ్య విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నలమలపు కృష్ణారెడ్డి అన్నారు. ఆదివారం నాగులుప్పలపాడులోని ఎంపీపీ క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన మండల వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తల ఆత్మీయ సమావేశంలో కృష్ణారెడ్డి మాట్లాడుతూ ప్రతి కుటుంబానికి వ్యక్తిగత లబ్ధి ప్రభుత్వ పథకాల వలన చేకూరిందని, అలాంటి ప్రతి కుటుంబం దగ్గరకు గ్రామాల్లోని నాయకులు ఐక్యంగా కలిసి వెళ్లి పార్టీ సంక్షేమ పథకాలను వివరించి తిరిగి ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసేలా బలోపేతం చేయాలని తెలిపారు. ప్రతి ఒక్క కార్యకర్తకు కూడా పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో లిడ్‌క్యాప్ స్టేట్ డైరెక్టర్ కంచర్ల సుధాకర్, ఇస్తర్ల అంజయ్య, పోలినేని కోటేశ్వరరావు, ఘట్టమనేని అశోక్, పాలపర్తి రత్తయ్య, మద్దిసాని నాగేశ్వరరావు, పొద పవన్, వడ్డిముక్కల శ్రీను, అనురాధయ్య, తదితరులు ఉన్నారు.


ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి, శచీదేవి దంపతులు పార్టీ నాయకులతో కలిసి నగరంలోని గోరంట్ల కాంప్లెక్స్‌లో 'హనుమాన్' సినిమాను ఆదివారం రాత్రి వీక్షించారు.